క్లుప్తంగా

ఘనంగా శ్రీమహాయోగి లక్ష్మమ్మ ఆరాధన



శ్రీమహాయోగి లక్ష్మమ్మను పూజిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరులోని కొత్తపేటలో వెలసిన శ్రీ మహాయోగి లక్ష్మమ్మ 31వ ఆరాధన ఉత్సవాలు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు లద్దగిరిలో శ్రీరామ దాసు స్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్ : మండలంలోని లద్దగిరి గ్రామంలో వెలసిన శ్రీరామదాసు స్వామి తిరునాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం నందికోల సేవా కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా డిసెంబర్ 15వ తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం సూర్యనారాయణ భవన్‌లో యూనియన్ నగర నాయకుడు జి.ఏసు అధ్యక్షతన మట్టి అడ్డా కార్మికుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో కర్షకుల సమస్యల పరిష్కారంపై పలు తీర్మానాలు చేసే అవకాశం ఉందన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, వెంకటరాముడు, మల్లుకల్లు, దాసు, ఈశ్వరమ్మ, శేషమ్మ, శాంతమ్మ, సరోజమ్మ, మరయమ్మ, రమాదేవి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో డిజిటల్ అసిస్టెంట్లు కీలకం



డిజిటల్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర క్రీడల నిర్వహణలో డిజిటల్ అసిస్టెంట్లు కీలకమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ హాలులో జిల్లా స్థాయిలో సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో మాట్లాడుతూ సచివాలయాల పరిధి నుంచి నిర్వహిస్తున్న క్రీడల సమాచారాన్ని ఎప్పటి కప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని క్రీడల విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు. అంతకు ముందు ఈనెల 4,5 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డిజిటల్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

పాణ్యం: పాణ్యం దొంగు వీధి లో వెలిసిన నరసింహస్వామి కల్యాణం శనివా రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

- భూ హక్కు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు కింద లబ్ధిదారురాలికి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, వారి ఆర్థికాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. శనివారం కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం కింద 21మంది లబ్ధిదారులకు డీపట్టాలతోపాటు, ఎస్సీ కార్పొరేషన్ కింద భూములు పొందిన 75మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా దళితుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ సాగు చేసుకుంటున్న భూములపై సంపూర్ణ భూహక్కును కల్పిస్తూ పట్టాలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే గత ప్రభుత్వ హయంలో ఎస్సీ కార్పొరేషన్ కింద కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన 75మంది లబ్ధిదారుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా సంతోషంగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటర్ వ్యవస్థ ద్వారా కుల మత బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నేరుగా సంక్షేమ ఫలాలను అందజేస్తోందన్నారు. సీఎం పదవి నాకు కొత్తకాదని పదేపదే చెప్పుకునే చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తన హయాంలో ప్రజలకు చేసిన మేలును చెప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏ మాత్రం తగదన్నారు. ప్రజలను మభ్యపెట్టడం బాబు నైజమని, ఎన్నికలు సమీపిస్తుండడంతో కుట్రలు, కుతంత్రాలకు యత్నిస్తున్న టీడీపీ మరోమారు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, స్థానిక నాయకులు పులకుర్తి సత్యారెడ్డి, మధుమోహన్‌రెడ్డి, పాపిరెడ్డి, రమణారెడ్డి, అయ్యప్ప, బలరాం, మహేశ్వరరెడ్డి, ఇమ్మానేయలు, సోమశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



గతంలో ఏ ప్రభుత్వం కూడా మా గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని గుర్తించి మేము సాగు చేసుకుంటున్న భూములపై శాశ్వత భూహక్కు కల్పిస్తూ పత్రాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన భూ హక్కు పత్రాల ద్వారా మేము కూడా భూ యజమాన్యులం అయ్యాం. జగనన్నకు కృతజ్ఞతలు.

– వెంకమ్మ, పులకుర్తి

జగనన్నకు రుణపడి ఉంటాం



మా పేరు మీద సెంటు భూమి లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎకర్నర భూమికి శాశ్వత భూ హక్కు కల్పిస్తూ పత్రాలు మంజూరు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మాబోటి వాళ్లను పట్టించుకోలేదు. జగనన్న మాత్రం భూమిపై హక్కులు కల్పిస్తూ పత్రాలు ఇచ్చారు. జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటుంది.

– లలితమ్మ, పులకుర్తి

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామ వలంటరీగా పని చేస్తున్న బోనిగేని వీరాంజనేయులుపై హత్యాయత్నం చేసిన నిందితుడు బోనిగేని జనార్దన్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి భార్యతో వీరాంజనేయులు ఫోన్‌లో మాట్లాడుతూ చనువుగా ఉన్నాడు. దీనిపై జనార్దన్ పలుమార్లు హెచ్చరించినా మార్పులేకపోవడంతో ఈ నెల 5వ తేదీ పొలం నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న వీరాంజనేయులును స్కార్పియో వాహనంతో ఢీకొట్టి హత్య చేసేందుకు యత్నించారు. ఈ ఘటనలో గాయపడిన వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఘనంగా వైఎస్ భారతి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్/గూడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కోడుమూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఇంచార్జి ప్రభాకర్, స్థానిక నాయకులు పులకుర్తి సత్యారెడ్డి, మధుమోహన్‌రెడ్డి, పాపిరెడ్డి, లద్దగిరి అన్వర్, రమణారెడ్డి, బలరాం, అయ్యప్ప, ఇమ్మానేయులు తదితరులు పాల్గొన్నారు.

- స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ భారతి జన్మదిన వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు.
- గూడూరు పట్టణంలో శనివారం వైఎస్ భారతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ముందుగా పూల మాలలు వేసి నినాదాలు ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి భారతమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, బీవై రామయ్య
- ఎమ్మెల్యే స్వగృహంలో కార్యకర్తల సమావేశం
- హాజరైన నాలుగు మండలాల నాయకులు

కల్లూరు: జిల్లాలో ఈ నెలలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని వైఎస్ఆర్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. త్వరలో పాణ్యం నియోజకవర్గ పరిధిలో జరిగే విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమానికి సీఎం రానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసాని తన స్వగృహంలో కల్లూరు అర్బన్, గ్రామీణ, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ల పిల్లలు చదువుకునేందుకు ఇబ్బంది పడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాల ద్వారా పైసా ఖర్చులేకుండా వారు ఉన్నత చదువులు చదువుకుంటున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎంతో మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అమ్మఒడి పేరు తో తల్లుల ఖాతాలో ప్రతి ఏడాది రూ. 15వేలు వేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు.

చెప్పాడంటే చేస్తారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా చెప్పాడంటే చేస్తారని వైఎస్ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు,నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. విద్య, వైద్యానికి పేదలు ఇబ్బందులు పడకూడదని ఆ రెండు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఇప్పటికే నాడు-నేడు పేరుతో పాఠశాలలు, ఆసుపత్రులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా కరోనా సమయంలో పేదల కోసం సంక్షేమ పథకాలనుఅమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే అన్నారు. అయితే, ప్రస్తుతం ఎన్నికల సమీపిస్తుండటంతో ప్రతిపక్ష పార్టీలు మాయమాటలు చెబుతున్నారని,వారిని నమ్మవద్దన్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీనాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్లకు చెందిన డైరెక్టర్లు, పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- వైద్యసిబ్బందికి నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ ఆదేశం



గడివేముల పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గడివేముల: ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం మండల కేంద్రం గడివేములలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వివిధ చికిత్స నిమిత్తం వచ్చిన వారితో మాట్లాడారు. సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల్లో ఓపీ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమై రోగులను పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



కంబదహాల్ మాజీ సర్పంచ్ మాదమ్మకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్:మండలంలోని కంబదహాల్ గ్రామం మాజీ సర్పంచ్ మాదమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డితోపాటు నాయకులు మాదమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త నాగన్న, కుమారులు రామాంజనేయులు, రామకృష్ణ తదితరులను పరామర్శించారు. అంత్యక్రిలలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహుడు, మండల కార్యదర్శులు మహానంది, ముందరింటి వెంకటేష్, పులిరాజు, సభ్యులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భవన అనుమతి ఫీజు బకాయిలు చెల్లించాలి

కర్నూలు(టౌన్): నగరపాలక పరిధిలో భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతుల ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు. ఎన్ని సార్లు నోటీసులు జారీ చేసినా స్పందించని భవన యజమానులపై నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం లోక్ అదాలత్‌ను ఆశ్రయించింది. విచారణలో భాగంగా శనివారం స్థానిక నగరపాలక కార్యాలయ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. నోటీసులు అందుకున్న వారు బకాయిలు చెల్లించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ నోటీసులకు స్పందించిన పలువురు భవన యజమానులు బకాయిలు చెల్లించినట్లు చెప్పారు. ఒక్కరోజు రూ.23 లక్షలు చెల్లించారని, మరో 5 రోజుల గడువులోపు మిగతా మొత్తం వసూలు అవుతుందని చెప్పారు. లోక్ అదాలత్ నోటీసులకు స్పందించకుంటే భవనాలను సీజ్ చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రంగస్వామి, శశిలత, బిల్డింగ్ పర్యవేక్షకులు మంజులమ్మ, మస్రత్ అలీఖాన్, సుబ్బన్న, భార్గవ్, నరసింహులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలు రిడ్జ్ మాంటిస్సోరి పాఠశాలలు

కర్నూలు(టౌన్): నగరంలోని స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో రెండు రోజులుగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లూ క్లబ్స్ గ్రాస్ రూట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ శనివారం సాయంత్రం ముగిసింది.అండర్-7 బాలికల విభాగంలో రిడ్జ్ పాఠశాల, మాంటిస్సోరి ఏ.క్యాంపు పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. అండర్-12 బాలికల విభాగంలో బి. క్యాంపు ఫుట్‌బాల్ జట్టుపై 2-1 స్కోర్‌తో రిడ్జ్ పాఠశాల జట్టు విజేతగా నిలిచింది.అండర్ -12 బాలుర విభాగంలో బి. క్యాంపు క్లబ్ రిడ్జ్ పాఠశాల జట్టుపై 3-1 స్కోర్‌తో విజయం సాధించింది. అండర్-7 విభాగంలో మాంటిస్సోరి జట్టుపై రిడ్జ్ పాఠశాల జట్టు 2-1 స్కోర్‌తో గెలుపొందింది. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, విజయ్‌కు మార్,కోచ్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కర్నూలు (టౌన్): ఇటీవల కడప జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను టీడీపీ నాయకులు టీజీ భరత్ శనివారం అభినందించారు. రాయలసీమ ఫిట్నెస్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కిడ్స్ వరల్డ్‌లో సాధన చేసే తైక్వాండో క్రీడాకారులు పతకాలు సాధించారు. స్థానిక మౌర్య ఇన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీ మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని స్పోర్ట్స్‌సిటీగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ సతీష్‌కుమార్, న్యాయవాది శ్రీధర్, యూఆర్‌బీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఊట్ల రమేష్ పాల్గొన్నారు.

మేము ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే..



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో గడిగరేవుల నాయకులు

- టీడీపీలో చేరినట్లు ప్రచారం సరికాదు
- గడిగరేవుల నాయకులు నాగశేషులు, నారాయణ, రాముడు

గడివేముల: మేము ఎప్పటికీ వైఎస్ఆర్‌సీపీలోనే ఉంటామని, వ్యక్తిగత కారణాలతో శుక్రవారం కర్నూలుకు వెళ్లినప్పుడు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేయడం మంచిది కాదని గడిగరేవుల నాగశేషులు, నారాయణ, రాముడు తెలిపారు. శనివారం వారు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో తమ కుటుంబాలు ఎన్నో సంక్షేమ పథకాలు పొందాయన్నారు. వివిధ రూపాల్లో మేలు చేసిన వైఎస్సార్‌సీపీని వదిలే పెట్టే పరిస్థితి లేదన్నారు. గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మా గ్రామంలో ఎవరూ పార్టీ వీడలేదని అనవసరంగా ఎల్లో మీడియా ప్రచారం చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే పేదల పక్షాన నిలబడి అందరికీ న్యాయం చేస్తున్నారని చెప్పారు. కర్నూలుకు వ్యక్తిగత కారణాలతో వెళ్లిన వారిని బలవంతంగా కండువాలు వేసి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేయడం దారుమణమన్నారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యేను వారు పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కుల వెంకటరమణ, చింతల గోవిందరాజులు, నగిరి శివుడు, గోపాలయ్య, కోఆప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కేవీఆర్ లెక్చరర్‌కు పతకం



రెండో స్థానంలో నిలిచిన లెక్చరర్ లత

కర్నూలు (టౌన్) : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో ఈనెల 8 వ తేదీ నుంచి ప్రారంభమైన 42 వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలు కేవీఆర్ కళాశాలకు చెందిన లెక్చరర్ బి. లత (35 సంవత్సరాలు పైబడిన విభాగంలో) రెండో స్థానంలో నిలిచి పతకం సాధించారు. 5 కిలో మీటర్ల విభాగంలో విజేతగా నిలిచిన లెక్చరర్‌ను కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేసింది.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం
- హాజరైన మేయర్, ఎమ్మెల్యేలు, మున్సిపల్ ఉద్యోగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కమిషనర్ భార్గవ్‌తేజ



వనభోజనం చేస్తున్న దృశ్యం

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం శనివారం సందడిగా సాగింది. మండల పరిధిలోని గార్గేయపురం రోడ్డులోని నగర వనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ్‌తేజతో పాటు డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళా కార్పొరేటర్లు, మహిళా ఉద్యోగులు ఆటవిడుపుగా వీల్‌చైర్స్, అంత్యక్షరీ ఆడారు. కొందరు ఉత్సాహంగా సినిమా పాటలకు డ్యాన్స్ చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో పాటు పలువురు నగర వనంలో కొంతసేపు బోటు షికారు చేశారు. కార్తీక వనభోజనం పేరుతో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరం ఒకచోట చేరి కాలక్షేపం చేయడం మంచి పరిణామమమని మేయర్, ఎమ్మెల్యేలు అన్నారు. నగరపాలక కమిషనర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం అందరు కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి జన్మదినం సందర్భంగా మేయర్, ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు.

వన భోజన సందడి

ఓర్వకల్లు: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామ పొలిమేరలో చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద శనివారం స్థానిక తొగట వీర క్షత్రీయ సంఘం వనభోజన కార్యక్రమం నిర్వహించింది. దాదాపు వంద కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం కలిసి భోజనం ఆరగించారు.